క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మోమిన్‌పేట: మోమిన్‌పేటలోని సబ్‌స్టేషన్‌లో నూతన బ్రేకర్‌ను ఫిట్టింగ్ చేయనుండటంతో ఆదివారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ ఏఈఈ వెంకటేశం తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు గ్రహించి తమకు సహకరించాలని ఆయన కోరారు.

ఆంజనేయ స్వామికి పూజలు



స్వామివారిని దర్శించుకుంటున్న హిందూవాహిని, ఆర్‌ఎస్‌ఎస్ భక్తులు

కొడంగల్ రూరల్: పట్టణ శివారులోని సిద్ధ నొంపు ఆంజనేయ స్వామి దేవాలయ ఆవరణలో శనివారం ఆర్‌ఎస్‌ఎస్, హిందూ వాహిని ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి పంచామృతాభిషేకం, చందనలేపనం, అష్టోత్తర శతనామావళి, ధూపం, దీపం, నైవేద్యం సమర్పిస్తూ మంగళ హారతులు ఇచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి సన్నిధిలో 103వ శనివారాన్ని పురస్కరించుకొని సామూహిక హనుమాన్ చాలిసా పారాయణం చేపట్టారు.

కీర్తి కిరీటాల పురస్కారం అందజేత



పురస్కారం అందుకుంటున్న శ్రీశైలం

యాలాల: మండల పరిధిలోని పగిడియాల ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న గొల్ల శ్రీశైలం తెలుగు కీర్తి కిరీటాల పురస్కారం అందుకున్నారు. తెలుగు భాష వారోత్సవాల సందర్భంగా నగరంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రదానం చేశారు. ఈ పురస్కారాన్ని సినీ నిర్మాత బత్తిని కీర్తి లతాగౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ పురస్కారంతో బాధ్యత మరింత పెరిగిందన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరడం అభినందనీయం

మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి



సబితారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్ నాయకులు

నవాబుపేట: మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరడం అభినందనీయమని మహేశ్వరం ఎమ్మెల్యే సబితా రెడ్డి పేర్కొన్నారు. శనివారం పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్‌లో చేరిన వారిలో మాజీ వైస్ ఎంపీపీ బందయ్యగౌడ్, గోపాల్, వేమారెడ్డి, మల్లయ్య, శ్రీనివాస్, శ్రీశైలం, జగదీష్, తదితరులు చేరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నాగేందర్‌గౌడ్, దయాకర్‌రెడ్డి, భరత్‌రెడ్డి, విజయ్‌కుమార్, పుషోత్తం, మాణిక్‌రెడ్డి, శాంత కుమార్, మహేశ్వర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అఖండ హరినామ సంకీర్తనలో రుద్రారం సభ్యులు



అఖండ హరినామ సంకీర్తనలో రుద్రారం భజన మండలి సభ్యులు

కొడంగల్ రూరల్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే అఖండ హరినామ సంకీర్తన కార్యక్రమంలో శనివారం రుద్రారం గ్రామానికి చెందిన వీరాంజనేయ స్వామి భజన మండలి సభ్యులు పాల్గొన్నారు. తిరుమల అఖండ హరినామ సంకీర్తన ఆహ్వానం మేరకు రెండు రోజుల క్రితం ఇక్కడి నుంచి భజన మండలి సభ్యులు తరలివెళ్లారు. 2012 నుంచి ప్రతీ యేడాది రెండు రోజుల భజన కార్యక్రమానికి ఆహ్వానిస్తున్నారని భజనమండలి సభ్యులు వివరించారు. భజన మండలి సభ్యులు డాక్టర్ సంగమేష్, డాక్టర్ మనోహర్, మాజీ సర్పంచు టి.సాయప్ప, బన్సీలాల్, నాగరాజు, అంబయ్యగౌడ్, మోహన్ రెడ్డి, టి.సందప్ప, సి.శేఖర్, వి.రాజేష్, పి.శివ పాల్గొన్నారు.

కల్వర్టులతో భద్రం!



బ్రహ్మణపల్లి వంతెనపై నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలకు అంతరాయం (ఫైల్)

భారీ వర్షాలు కురిస్తే రాకపోకలకు అంతరాయం

- శిథిలావస్థకు చేరిన బ్రహ్మణపల్లి, పాలేపల్లి, గొడుగోనిపల్లి వంతెనలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు, రైతులు
- పట్టించుకోని అధికారులు

దోమ: అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల అలసత్వం వెరసి ప్రయాణికుల పాలిట శాపంగా మారుతోంది. ఏళ్ల క్రితం నిర్మించిన వంతెనలు శిథిలావస్థకు చేరడంతో వాటిపైనుంచి రాకపోకలు నిర్వహించాలంటే వాహనదారులు, రైతులకు, స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. అవి పాత పడడంతో ఎప్పుడు కూలుతాయోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆ రహదారుల గుండా ప్రయాణించాలంటే జంకుతున్నారు. నిత్యం ఆయా గ్రామాల వాహనదారులు వివిధ పనుల నిమిత్తం పట్టణాలకు రాకపోకలు నిర్వహిస్తున్నారు. మరమ్మతులు చేపట్టని వంతెనలు దాటాలంటే భయ పడుతున్నారు. ప్రతీ సంవత్సరం ఈ విషయంలో తంటాలు పడుతున్నారు. వర్షాలు దంచి కొడితే శిథిలావస్థలోని కల్వర్టులు తెగిపోయే ప్రమాదాలు లేకపోలేదు.

బ్రహ్మణపల్లి, పాలేపల్లి, గొడుగోనిపల్లి పరిధిలో..

బ్రహ్మణపల్లి, పాలేపల్లి, గొడుగోనిపల్లి గ్రామాల పరిధిలో కల్వర్టులను కొన్నేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. నిత్యం పరిగి పట్టణంతో పాటు ఆయా గ్రామాలకు ప్రయాణికులు ఈ వంతెనపైనుంచే వెళ్లాల్సి వస్తోందని చెబుతున్నారు. అయితే శిథిలావస్థకు చేరుకోవడంతో అటుగా ప్రయాణించే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయం సంబంధిత అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని ప్రయాణికులు విమర్శిస్తున్నారు.

రాకపోకలు బంద్..

బ్రహ్మణపల్లి సమీపంలోని వంతెనపై పెద్ద గుంత ఏర్పడింది. అటుగా ప్రయాణించే వారు కొన్ని సార్లు గుంతలో పడి ప్రమాదానికి గురైన సంఘటనలు కూడా ఉన్నాయి. అంతేకాకుండా భారీ వర్షం కురిస్తే వంతెనపై నుంచి నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలకు అంతారాయం కలుగుతుంది. ఆ నీరంతా కాకారవాణి ప్రాజెక్టుకు చేరుతుంది. అటు గొడుగోనిపల్లి గ్రామ సమీపంలోని కల్వర్టు అకాల వర్షానికి తెగిపోవడంతో బీటీ రోడ్డును కోతలకు గురిచేసింది. దీంతో ఆ రోడ్డు గుండా ప్రయాణించే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దోమ, పాలేపల్లి మధ్య ఉన్న కల్వర్టు శిథిలావస్థకు చేరడంతో దీనిపైనుంచి వెళ్లాలంటేే భయం..భయంగా ప్రయాణిస్తున్నారు. వర్షాలకు ఆ వాగు ఉధృతంగా ప్రయాణిస్తుంది. ఆ ప్రవాహం కాకారవాణి ప్రాజెక్టుకు చేరుతుంది. దీంతో అటుగా ప్రయాణించే వాహనదారులకు ప్రతీ వర్షాకాలం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు శిథిలావస్థకు చేరిన వంతెనలను, కల్వర్టులను బాగు చేయాలని, వాటి ఎత్తును పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చర్యలు చేపట్టాలి..



శిథిలావస్థకు చేరిన వంతెనలు, కల్వర్టులను సంబంధిత అధికారులు వెంటనే మరమ్మతులు చేయించాలి. వర్షాలకు వంతెనపై నీటి ప్రవాహం ప్రమాదకరంగా ఉంటుంది. దీంతో అనుకోని సంఘటనలు, ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువ. ఈ విషయంలో వాహనదారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి వంతెనా ఎత్తు పెంచేవిధంగా చర్యలు తీసుకోవాలి.

– రాఘవేందర్‌రెడ్డి, బ్రాహ్మణపల్లి

కోతలకు రోడ్డు తెగిపోయింది..



భారీ వర్షాలు కురువడంతో గొడుగోనిపల్లి సమీపంలోని వాగు ఉధృతంగా ప్రవహింస్తోంది. వంతెన పైభాగం నుంచి నీరు ప్రవహించడంతో పరిగి, మహబూబ్‌నగర్ ప్రధాన బీటీ రోడ్డు తెగి కోతలకు గురైంది. అటుగా అనేక వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నాయి. ఆ వంతెనపై ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని జంకుతున్నారు. సంబంధిత అధికారులు కోతలకు గురైన రోడ్లను వెంటనే మరమ్మతులు చేయించాలి.

– జహిరొద్దీన్, గొడుగోనిపల్లి

పల్లెల్లో తాగునీటి ఎద్దడి



ట్యాంకర్ల వద్ద నీటిని పట్టుకొంటున్న గ్రామస్తులు



కుల్కచర్ల: బైక్‌పై మంచినీరు తీసుకెళ్తున్న తండావాసి

పట్టించుకోని అధికారులు

మోమిన్‌పేట: పల్లెల్లో తాగు నీటి ఎద్దడి నెలకొంటుంది. గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు సరఫరా కాని సమయాల్లో ప్రత్యమ్నాయ చర్యలు చేపట్టాల్సిన కార్యదర్శులు నిధులు లేవని పట్టించుకోవడంలేదు. దీంతో నీటి సరఫరా కాని ప్రతీసారి గ్రామస్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. రెండు మూడు రోజులు భగీరథ నీరు సరఫరా కాకపోతే సమీప బోరుల నుంచి తెచ్చుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీల్లో నిధులు లేకపోవడంతో మిషన్‌భగీరథ నిర్వహణ ఖర్చులు సరిపోకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరిస్తున్నారు. స్టాటర్లు, కేబుల్ తీగలు తరచూ కాలిపోవడంతో మరమ్మతులకు నిధులు చాలడం లేదని కార్యదర్శులు బదులిస్తున్నారు.

తుపాకుల తండాలో...

కుల్కచర్ల: వర్షాలు కుంభవృష్టిలా కురుస్తున్నా తండాల్లో తాగునీటి కష్టాలు తప్పడం లేదు. కుల్కచర్ల మండలం బండమీది తండా గ్రామ పంచాయతీలోని తుపాకుల తండాలో 4రోజులుగా మంచినీరు లేక పొలాలు, సమీప బోరుబావులనుంచి, ఆటోల్లో, బైకులపై వెళ్లి తెచ్చుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీల్లో పాలకులు లేకపోవడంతో ఈ సమస్య ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి నెలకొందని వివరిస్తున్నారు. ఈ విషయం గురించి పంచాయతీ కార్యదర్శులను ప్రశ్నిస్తే ఇప్పటికే తాము అప్పులు చేసి నిర్వహణ ఖర్చులు భరించినట్లు చెబుతున్నారు. తాము ఇక డబ్బులు పెట్టలేమని వాపోతున్నారు. ఇప్పటికైనా ఈ విషయంలో జిల్లా అధికారులు, స్పందించి సమస్యను పరిష్కరించి తండావాసులకు నీటి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

రుద్రారం, మున్నూరుసోమారం, ధారూరులో..

ధారూరు: ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నా మండల పరిధిలోని పలు గ్రామాల ప్రజలు తాగు నీటికి అవస్థలు పడుతున్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరా ఆగిపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. రుద్రారం, మున్నూరుసోమారం, ధారూరు తదితర గ్రామాల్లో ట్యాంకర్ల వద్ద నీళ్ల కోసం మహిళలు సిగపట్లు పడుతున్నారు. కేసీఆర్ పాలనలో ఏ ఒక్క రోజు కూడా బిందెలతో బయటకు వచ్చిన సందర్భాలు లేవని ఆవేదన వ్యక్తంచేశారు. నీళ్ల కోసం వ్యవసాయ బోరుబావుల వద్దకు పరుగులు తీశారు. అధికారులు స్పందించి, సమస్యను పరిష్కరించకపోతే కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



మున్నూరుసోమారంలో ట్యాంకర్ వద్ద పరస్పర వాగ్వాదం



రుద్రారంలో నీళ్ల కోసం మహిళల అగచాట్లు

మండలంలో ఆగని వర్షం



కోత్లాపూర్ రోడ్డు పరిస్థితి

- బురదమయమైన రోడ్డు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు

తాండూరు రూరల్: మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం కూడా వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏకదాటిగా కురవడంతో రోడ్లు బురదమయమయ్యాయి. ఈ రహదారుల గుండా వాహనదారులు, పాదచారులు రాకపోకలు చేయలేక ఇబ్బందులు పడ్డారు. అంతేకాకుండా ఆయా గ్రామాల్లోని ప్రధాన రోడ్లకు ఏర్పడ్డ గుంతల్లో నీరు చేరి ప్రయాణం అస్తవ్యస్తంగా మారింది. ముఖ్యంగా అల్లాపూర్, రాంపూర్ గేటు, ఐనెల్లి, కోటబాసుపల్లి, మల్కాపూర్ గేటు, కోత్లాపూర్ వద్ద రోడ్లన్ని బురదతో నిండాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పత్తి చేనుల్లో నీరు నిలిచాయి. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పంట చేతికొస్తుందో రాదోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెద్దేముల్ మండలంలోని ఆయా గ్రామాల్లో కూడా వర్షం జోరుగా పడింది. బుద్దారం, గాజీపూర్ వాగులు ఉధృతంగా ప్రవహించాయి. గాజీపూర్–పెద్దేముల్ రోడ్డు గుంతలమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

పాఠశాలలో బోర్డు ఏర్పాటు

షాబాద్: పాఠశాల అభివృద్ధికి దాతల సహకారం ఎంతో అవసరమని హెచ్‌ఎం మల్లేశ్‌గౌడ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని ఎల్గొండగూడ ప్రాథమిక పాఠశాలలో దాత రవీందర్‌రెడ్డి బోర్డు ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా దాతను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు ఉన్నారు.



దాత రవీందర్‌రెడ్డిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు

సామాజిక అంశాలపై అవగాహన అవసరం

ఎస్‌ఐ రమేశ్



కేజీబీవీలో సూచనలు ఇస్తున్న రమేశ్

కుల్కచర్ల: విద్యార్థులు సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవాలని కుల్కచర్ల ఎస్‌ఐ రమేశ్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని కేజీబీవీలో షీటీం ఆధ్వర్యంలో విద్యార్థులకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, సైబర్ మోసాలపై ఎదురయ్యే నష్టాలు, సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు. మొబైల్ ఫోన్లు వాడకం వల్ల కలిగే అనర్థాల గురించి మాట్లాడారు. చదివేటప్పుడు ఫోన్లను దగ్గర పెట్టుకోవద్దని, కాలక్షేపం కోసమని ఫోన్లను వినియోగించొద్దని హెచ్చరించారు. ఏదైనా అత్యవసర పరిస్థితులు, ఇబ్బందులు తలెత్తితే 100 లేదా 181కి సమాచారం చేరవేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారి దేవి, షీటీం సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ధ్వంసమైన రోడ్లను బాగు చేయించాలి



రోడ్లను బాగు చేయాలని ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం

నవాబుపేట: ధ్వంసమైన రోడ్లను బాగు చేయించాలని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం ప్రభుత్వాని కోరారు. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహించనున్న సేవాపక్షం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. శనివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సేవాపక్షం కార్యక్రమంలో ప్రతీ కార్యకర్త పాల్గొనాలని పిలుపునిచ్చారు. ర్యాలీ అనంతరం భారీ వర్షాలతో పంట నష్టం, ధ్వంసమైన రోడ్లను బాగు చేయించాలనే డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. ఈ విషయంలో ప్రభుత్వం స్పందించి వెంటనే సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఐటీ సెల్ కోకన్వీనర్ శ్రీకాంత్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు ప్రభాకర్ రెడ్డి, శ్రీధర్ రావు మాజీ సర్పంచ్‌లు జైపాల్ రెడ్డి, గోపాల్ గౌడ్, రత్నం, రామచంద్రయ్య నాయకులు గాలయ్య, మహేందర్ రెడ్డి, రత్నం, రాజశేఖర్ రెడ్డి, రవీందర్, శ్రీహరి, బూత్ అధ్యక్షుడు, సీనియర్ నాయకుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం

మొయినాబాద్‌రూరల్: దేశ చరిత్రలో యూరియా కోసం రైతులు ఇంతలా తిప్పలు పడిన పరిస్థితులు గతంలో ఎప్పుడు రాలేదని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం రైతులు పడుతున్న కష్టాలను చూసి ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ పాలనతో పంట పొలాల్లో ఉండాల్సిన రైతులు యూరియా కోసం ఆఫీసులు, అధికారుల చుట్టూ, రోడ్లపై బారులు తీరుతున్నారన్నారు. ఎదుగుదలలో వరి, పత్తి పూత దశలో ఉందని యూరియా వేయకపోతే దిగుబడి రాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోకవోవడం దారుణమన్నారు. కేసీఆర్ పాలనలో రైతులకు సకాలంలో ఎరువులు సరఫరా చేశారన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు వెంకటప్ప



చెక్కు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

దౌల్తాబాద్: మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన జోగు ఆనందమ్మకు మంజూరైన రూ.50వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు వెంకటప్ప అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరమన్నారు.

సేవా కార్యక్రమాలు నిర్వహించాలి

షాబాద్: ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని నాగర్‌గూడలో బీజేపీ మండల అధ్యక్షుడు మద్దూరు మాణయ్య అధ్యక్షతన పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సేవ పక్వాడ కన్వీనర్‌గా బీజేవైఎం మండల అధ్యక్షుడు దాదే మహేశ్, కో–కన్వీనర్లుగా రవిగౌడ్, సందీప్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబర్ 17వ తేదీన ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా బూత్ స్థాయి నుంచి సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గ్రామాలలో మొక్కలు నాటడం, స్వచ్ఛభారత్ కార్యక్రమాలు, రక్తదానం చేయడం వంటి కార్యక్రమాలు చేయాలన్నారు.

అన్యాయం చేస్తే సహించం

ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాజ్‌కుమార్



వినతిపత్రం అందజేస్తున్న రాజ్‌కుమార్, ఏఐటీయూసీ జనరల్ సెక్రెటరీ దస్తప్ప

తాండూరు రూరల్: మండల పరిధిలో కరన్‌కోట్ గ్రామ శివారులోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు అన్యాయం చేస్తే సహించమని ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాజ్ కుమార్ పేర్కొన్నారు. శనివారం సీసీఐ ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్‌ను కలిసి కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ..ఫ్యాక్టరీలో ప్యాకింగ్ ప్లాంట్‌లో పని చేస్తున్న కార్మికులకు ప్రతిరోజు వేతనంగా రూ.610 చెల్లించేవారన్నారు. కానీ కొత్తగా వచ్చిన కాంట్రాక్టర్ రూ.510 రోజువారి వేతనంగా ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. ఈ విషయంలో ప్యాకింగ్ ప్లాంట్ కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. తక్షణమే అధికారులు జోక్యం చేసుకొని న్యాయం చేయకపోతే కార్మికులతో కలిసి ఫ్యాక్టరీ గేటు వద్ద ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసి ఫ్యాక్టరీ జనరల్ సెక్రెటరీ దస్తప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గౌడ సంఘం నాయకులు, గ్రామస్తులు

కుల్కచర్ల: ఇప్పాయిపల్లి గ్రామస్తులు, గౌడ సంఘం ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఇప్పాయిపల్లికి చెందిన శ్రీనివాస్, బాలకృష్ణ, సంతోషి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికవ్వడం అభినందనీయమన్నారు. శనివారం నిర్వహించిన కార్యక్రమంలో గ్రామస్తులు వారిని ప్రత్యేకంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ..విద్యార్థుల ఉన్నతికి నిర్విరామంగా పనిచేసి అందరి మన్ననలను పొందాలని పేర్కొన్నారు. ఎక్కడ పనిచేసినా గ్రామానికి కీర్తి తీసుకరావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బాల్‌రెడ్డి, నర్సింలు, నందు, శంకర్, శ్రీనివాస్, రాములు, నర్సింలు, మధు, తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా ఫ్రెషర్స్ డే

తాండూరు టౌన్: తాండూరులోని చైతన్య జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే శనివారం స్థానిక తులసీ గార్డెన్ ఫంక్షన్ హాల్లో ఉల్లాసంగా నిర్వహించారు. ఇంటర్ సెకండియర్ విద్యార్థులు, ఫస్టియర్ విద్యార్థులకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సంప్రదాయ, పాశ్చాత్య నృత్యాలతో అలరించారు. అనంతరం కళాశాల కరస్పాండెంట్ పెరుమాళ్ల వెంకట్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు నిర్దేశించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా చైతన్య కళాశాల విద్యనందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జగ్జీవన్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సింధూ బాలికల కళాశాలలో..

తాండూరు పట్టణంలోని సింధు బాలికల జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే శనివారం ఎంపీటీ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల వ్యవస్థాపకుడు రంగారావు మాట్లాడుతూ విద్యార్థులకు ఉత్తమ బోధన అందిస్తూ, వారి ఉన్నతికి తోడ్పడుతున్నామన్నారు. అనంతరం కళాశాల టాప్ ర్యాంకర్లకు నగదు బహుమతితో సన్మానించారు. విద్యార్థినులు ప్రదర్శించిన పలు నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్య సభ్యురాలు విజయాదేవి, ప్రిన్సిపాల్ సంగీత, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు



సింధూ బాలికల కలాశాలలో..